ప్రజాశక్తి
సోమవారం 13 మార్చి 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



చీరాలలో ఎమ్మెల్సీ అభ్యర్థి కరపత్రాలతో డబ్బులు పంచేందుకు వెళ్తున్న వైసిపి శ్రేణులు

ఓటుకు నోటు
పంచేశారు..!

- యథేచ్ఛగా డబ్బులు పంచిన అధికారపార్టీ నేతలు
- ఎక్కువ చోట్ల వాలంటీర్ల సాయంతో పంపిణీ
- ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ కరపత్రాలతో వైసిపి కార్యకర్తల ప్రచారం

ప్రజాశక్తి-చీరాల

ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిజాయతీగా గెలవలేమని భావించిన అధికారపార్టీ నేతలు అక్రమ మార్గమే ఎంచుకున్నారు. ఓటర్లను డబ్బుతో కొనేందుకు సిద్ధమై.. ఇంటింటికీ తిరిగి ఓటుకు నోట్లు పంచేశారు. ఆదివారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఓటర్లకు డబ్బులు పంచే పనిలోనే ఉన్నారు. ఎక్కువ చోట్ల వాలంటీర్ల ద్వారా పంచేశారు. ఇంత జరుగుతున్నా.. ఏమీ తెలియనట్లు అధికారులు ఉండటం గమనార్హం.

ఎమ్మెల్సీ ఎన్నికలకు శనివారంతో ఎన్నికల ప్రచారం ముగిసింది. ఈ ఎన్నికలను కూడా కలుషితం చేయాలని భావించిన అధికార పార్టీ ఆదివారం ఓటర్ల కొనుగోళ్ల పర్వం ముమ్మరం చేసింది. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ ఆదివారం ఈపురిపాలెం పద్మనాభుని పేట, ఇతర ప్రాంతాలలో వైసిపి కార్యకర్తలు ఎమ్మెల్సీ అభ్యర్థి కరపత్రాలు పట్టుకొని బహిరంగంగా ఇంటింటికీ తిరుగుతూ ఓట్ల కొనుగోలు చేపట్టారు. ఎమ్మెల్సీ ఓటుకు సుమారు రూ.వెయ్యి ముట్టజెప్పగా ఈ పాటికే ▶ 2లో

నేడే 'మండలి' పోలింగ్

- సర్వం సిద్ధం చేసిన జిల్లా యంత్రాంగం
- పోలింగ్, సామగ్రి పంపిణీ కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీలు
- ఓటుహక్కు వినియోగించుకోనున్న గ్రాడ్యుయేట్లు, ఉపాధ్యాయులు
- పిడిఎఫ్‌కు జనసేన మద్దతు.. రెండో ఓటేయాలని టిడిపి పిలుపు..



పోలింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీల ఎన్నికలకు సోమవారం నాడు పోలింగ్ జరగనుంది. ఇందుకోసం జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఉత్కంఠ పోరుకు అభ్యర్థులూ సన్నద్ధమయ్యారు. అభ్యర్థుల భవితవ్యం ఓటరు తేల్చనున్నారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ జరగనుంది. పోలింగు సామాగ్రి కూడా కేంద్రాలకు తరలిపోయింది. ప్రచారంతో పాటు పంపిణీలు ముగిశాయి. ఎమ్మెల్సీల గెలుపు కోసం రాజకీయ పార్టీలు ఎన్నడూ లేని విధంగా అన్ని అక్రమ వ్యవహారాలకూ తెరలేపాయి. డబ్బు పంపిణీ చేశారు. మేధావులుగా పేరున్న ఈ ఓటర్లను సైతం కలుషితం చేశారు. ఇచ్చేవాడుంటే తీసుకోవడానికి ఇబ్బందేమన్నట్లుగా కొందరు ప్రైవేటు టీచర్లు డబ్బులు తీసుకున్నారు. విద్యార్థుల్లోనూ మాస్టార్లు డబ్బులు తీసుకున్నారనే చర్చ బాహాటంగానే జరుగుతోంది. సమాజంపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేదీ ఆలోచించకుండా అక్రమాలకు పాల్పడ్డారు.

రాజకీయపార్టీలు ఎన్నికల స్వరూపాన్నే మార్చేశాయి. అందుకు భిన్నంగా పిడిఎఫ్ అభ్యర్థులు ప్రచారంలోనూ, ఓటర్లను కలవడంలోనూ ఉన్నారు. పాలకపక్షం నుంచి పోటీ చేసిన అభ్యర్థుల గెలుపు కోసం ఆ పార్టీ నేతలు అన్ని రకాలుగా అక్రమాలకు తెరలేపారు. ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారే తప్ప ఎజెండా ఏమీ లేదు. గెలవాలన్నదే పిలుపు తప్ప గెలిస్తే ఏం చేస్తామనేది చెప్పలేని పరిస్థితి. తెలుగుదేశం నుంచీ ప్రతిపక్షంగా పోటీ చేశారు.

అయితే వైసిపిని ఓడించాలనే వ్యూహం ఆశించిన స్థాయిలో ఆ పార్టీలో కనిపించలేదు. ప్రభుత్వంపై పోరాడే అభ్యర్థులకు పోటీగా పార్టీ నుంచి అభ్యర్థులను బరిలోకి దించడం గమనార్హం. ఆఖరు నిమిషంలో పిడిఎఫ్ అభ్యర్థులకు రెండో ప్రాధాన్యత ఓటేయాలని నిర్ణయించారు. పిడిఎఫ్ నుంచి ఉపాధ్యాయ అభ్యర్థిగా బాబురెడ్డి, గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా మీగడ వెంకటేశ్వరెడ్డి పోటీలో ఉన్నారు. వీరికి మద్దతుగా ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాలు ప్రచారం నిర్వహించాయి. వామపక్షాలు, జనసేన మద్దతు ప్రకటించాయి. తెలుగుదేశం పార్టీ రెండో ఓటు వేయాలని పిలుపునిచ్చింది. మూడు పర్యాయాలుగా పిడిఎఫ్ కూటమి నుంచే ఎమ్మెల్సీలు గెలిచారు. అన్ని వర్గాల సమస్యలపై తమ వైఖరిని ప్రచారంలో వెల్లడించారు. ఏదేమైనా రసవత్తరపోరు సాగనుంది. ప్రభుత్వంపై ఉద్యోగులు, మధ్యతరగతి వర్గాల్లో వ్యతిరేకత ఈ ఎన్నికల్లో ప్రభావం చూపుతుందనే చర్చ ఉంది. అందుకే వైసిపి నుంచి పోటీచేసిన అభ్యర్థులు డబ్బులు పంచారు. గెలుపుపై నమ్మకం లేకనే డబ్బులు పంచారనే విమర్శలు పెరిగాయి.

ఇక అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదివారం నాడు ఒంగోలు, మార్కాపురం, పొదిలి పట్టణాల్లో పోలింగు కేంద్రాలను పరిశీలించారు. సామగ్రి కేంద్రాలను తనికీ చేశారు. నిబంధనల ప్రకారం పోలింగు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. నియమావళి తప్పకుండా పాటించాలని ▶ 2లో

కారు అదుపుతప్పి..బోల్తా..

- తండ్రి, కుమారుడు దుర్మరణం
- తల్లికి తీవ్రగాయాలు
- వివాహానికి వెళ్లి వస్తుండగా ఘటన
- కనిగిరిలోని కాశిరెడ్డికాలనీ వద్ద ప్రమాదం



కారు బోల్తా పడటంతో అక్కకడిక్కడే మృతిచెందిన తండ్రి, కుమారుడు, ఇన్‌సెట్లో తీవ్ర గాయాలపాలైన సత్యవాణి

ప్రజాశక్తి-కనిగిరి

వివాహానికి కారులో వెళ్లి వస్తున్న కుటుంబాన్ని రోడ్డుప్రమాదం కబళించింది. కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొని బోల్తా కొట్టడంతో అందులోని తండ్రి, కుమారుడు అక్కడికక్కడే మృతిచెందారు. తల్లి తీవ్రగాయాలపాలైంది. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున కనిగిరి పట్టణంలోని కాశిరెడ్డికాలనీ వద్ద జరిగింది.

నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం, రాంపల్లికి చెందిన ఎన్ రామకోటేశ్వరరావు(60), అతని భార్య సత్యవాణి, కుమారుడు బ్రహ్మేశ్వర రావు(40) గుంటూరులో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొని.. ఆదివారం తెల్లవారుజామున కారులో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. కనిగిరి పట్టణంలోని కాశిరెడ్డి కాలనీ సమీపానికి వచ్చేసరికి కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. దీంతో కారు పల్టీలు కొట్టి బోల్తాకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న రామకోటేశ్వరరావు అతని కుమారుడు బ్రహ్మేశ్వరరావు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తల్లి సత్యవాణి తీవ్ర గాయాలపాలైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి పరిశీలించారు. తీవ్ర గాయాలపాలైన సత్యవాణిని ప్రభుత్వవైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఒంగోలుకు తరలించారు. ఎస్ఐ డి.ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జనసేనలోకి 'ఈదర'..

పార్టీ కండువా కప్పిన పవన్‌కళ్యాణ్



ఈదర హరిబాబును పార్టీలోకి ఆహ్వానిస్తున్న పవన్‌కళ్యాణ్

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

మాజీ జడ్పీ ఛైర్మన్ ఈదర హరిబాబు ఆదివారం నాడు జనసేన పార్టీలో చేరారు. పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ విజయవాడలో ఆయనకు కండువా కప్పి.. పార్టీలోకి ఆహ్వానించారు. ఈదర హరిబాబు కొంతకాలంగా బిజెపిలో ఉన్నారు. అక్కడా ఆయన క్రియాశీలకంగా పనిచేయలేకపోయారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఆయన తెలుగుదేశం పార్టీకి దూరంగా ఉంటూ వచ్చినా ఆయన అనుచరగణం అంతా ఆ పార్టీలోనే కొనసాగుతున్నారు. ఇప్పుడు జనసేనలో చేరడంతో ఒంగోలులో ఆయన రాజకీయ భవితవ్యం ఏమిటనే దానిపైనా చర్చ సాగుతోంది. 1994లో ఈదర హరిబాబు ఒంగోలు నుంచి తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేసి.. ఎమ్మెల్యేగా గెలిచారు. జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. జిల్లా కేంద్రంలో బలమైన నేతగా ఎదిగారు. 1999 ఎన్నికల్లో పార్టీలోని అంతర్గత కుమ్ములాటల వల్ల ఆయనకు టిక్కెట్టు రాకుండా చేశారు. ఆ ఎన్నికల్లో ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి.. సుమారు పాతిక వేలకు పైగా ఓట్లు పొందారు. దీంతో ఒంగోలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి బాగా దెబ్బతగిలింది. 2004 ఎన్నికల్లోనూ ఆయనకు టిక్కెట్టు ఇవ్వలేదు. కొంతకాలం కాంగ్రెసులో ఉన్నారు. తర్వాత మళ్లీ ఎన్నికల సమయంలో తెలుగుదేశంలో చేరారు. 2009లో టిక్కెట్టు ఇచ్చారు. అప్పుడు ఆయన ఓడిపోయారు. 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక ఆయన అనూహ్య పరిణామాల మధ్య జడ్పీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఇక్కడ పార్టీలో నేతల మధ్య ఉన్న విభేదాల కారణంగా ఆయన్ను తప్పించే యత్నం చేయడంతో సుప్రీంకోర్టుకు వెళ్లి పదవిని కాపాడుకున్నారు. జడ్పీఛైర్మన్ బాధ్యతలను ప్రభుత్వం సహకరించకపోయినా సమర్థవంతంగానే నిర్వర్తించారు. పార్టీకి వ్యతిరేకంగా జడ్పీ పీఠం దక్కించుకున్నారనే భావనతో పార్టీ నేత దామచర్ల జనార్ధన్ విభేదించారు. ప్రభుత్వ సహకారం లేకుండా చేశారు. అప్పటి నుంచి తెలుగుదేశం పార్టీకి దూరంగా ఉన్నారు. ఇప్పుడు జనసేనలో చేరడంతో ఆయన భవిష్యత్ రాజకీయాలపై చర్చ సాగుతోంది.

దళితుడి భూమిని పరిశీలించిన ఎంఎస్‌పిఎస్

ప్రజాశక్తి-మద్దిపాడు

దళితులను కూడా వదలవా ఎంతమందిని మోసం చేసి మాయ మాటలు చెప్పి డబ్బు వసూలు చేసి ఎగ్గొడతావు అని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుజనమాదిగ ఎమ్మెల్యేను ఉద్దేశించి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని బూరెపల్లి గ్రామానికి చెందిన కావూరి దేవదాసుకు చెందిన భూమిని సుజనా మాదిగ పరిశీలించారు. అనంతరం అయన విలేకర్లతో మాట్లాడుతూ దేవదాసు పొలానికి ఇరువైపులా వేరే సామాజిక వర్గానికి చెందిన భూములు ఉన్నాయని, వాటిని వదలి ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన వాడిదే తీసుకొని 20 అడుగుల లోతులో గ్రానైట్ కోసం తవ్వకాలు జరపడం ఏమిటని ప్రశ్నించారు. కోటి రూపాయిల విలువ చేసే గ్రానైట్ తీసుకున్నారని పేర్కొన్నారు. పక్కన అగ్ర కులాలకు చెందిన భూములు వదలి దళితులవి మాత్రమే తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. డబ్బులు అడిగితే వారిని బెదిరించి అతనికి రూ.15 లక్షలు ఇస్తానని చెప్పి, తవ్వకాలు జరిపాక డబ్బులు ఇవ్వకుండా దేవదాసును, ఆయన భార్యను స్టేషన్‌కు పిలిపించి భయపెట్టిన విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. ఎంఎల్‌ఏ కాకముందు అతని ఆస్తులు, ఎమ్మెల్యే అయిన తరువాత ఆస్తులపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దేవదాసుకు ఇస్తానన్న డబ్బులు ఇవ్వాలని, లేనిచో ఒంగోలు కలెక్టర్ కార్యాలయం ఎదుట మాదిగ సంక్షేమ పోరాట సమితి ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎన్ పాడు నియోజకవర్గం దళితులపై ఎంఎల్‌ఏ సుధాకర్ బాబు చేసిన ఆగడాలు, వారిపై పెట్టించిన కేసులు, ఉద్యోగాల పేరుతో వసూలు చేసిన డబ్బులు వీటన్నిటిపై రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డికి, జిల్లా ఇన్‌ఛార్జి మస్తాన్‌రావుకు, భూమన కరుణాకర్ రెడ్డికి, సజ్జల రామకృష్ణారెడ్డికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. మద్దిపాడు జడ్‌పిటీసి భర్త పుల్లారావు వద్ద చేబదులుగా తీసుకున్న 40 లక్షల రూపాయలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఆయాలు, టీచర్ పోస్టులు ఇస్తామని, ఇసుక సీనరేజ్ పేరుతో, నియోజకవర్గ పరిధిలో ఎస్ఐ, సిఐ, తహశీల్దారు నియామకాలకు డబ్బులు తీసుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. మద్దిపాడు మండలంలో నిర్మించిన అక్రమ కట్టడాలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా దేవదాసు డబ్బులు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బాధితుడు దేవదాసు మాట్లాడుతూ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు నా డబ్బులు ఇవ్వకుంటే నాకు మరణమే శరణ్యమని బోరున విలపించారు. వీరి వెంట ఎంఎస్‌పిఎస్ రాష్ట్ర నాయకులు ఆంజనేయులు మాదిగ, ఎంఆర్‌పిఎస్ నాయకులు జయరాజు మాదిగ, కన్నా మాదిగ, ఆమోసు మాదిగ, తెళ్ల శ్రీను మాదిగ, ఇత్తడి కుమార్ మాదిగ, శేఖర్ మాదిగ, శేషు మాదిగ పాల్గొన్నారు.

నేడే 'మండలి' పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

కోరారు. ఇక గ్రాడ్యుయేట్ ఓటర్లు 82,208 మంది ఉన్నారు. వీరి కోసం జిల్లాలో 98 పోలింగు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒంగోలు నియోజకవర్గంలోనే అత్యధికంగా 24,388 మంది ఓటర్లు ఉన్నారు. మార్కాపురంలో 10,833, కనిగిరిలో 10,400, గిద్దలూరులో 9296, కొండపిలో 7767 మంది, సంతనూతలపాడులో 7724 మంది, దర్శిలో 6875 మంది, వైపాలెంలో 4925 మంది గ్రాడ్యుయేట్లు ఓటేయనున్నారు. ఉపాధ్యాయ ఓటర్ల కోసం 40 కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్ని నియోజకవర్గాల్లో ఈ కేంద్రాలున్నాయి. ఉపాధ్యాయ ఓటర్లు 5,789 మంది ఉన్నారు. జిల్లాలో పోలింగు కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాట్లు కూడా చేశారు. ఎస్పీ మల్లికాగర్గిక్ బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

ఓటుకు నోటు పంచేశారు.!

(మొదటిపేజీ తరువాయి)

ప్రైవేటు విద్యాసంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు పంచినట్లు బహిరంగ ప్రచారం జరుగుతోంది. వాలంటీర్లను బలవంతంగా అటు ప్రచారాలలోనూ, ఇటు నగదు పంపిణీకి వినియోగిస్తూ వైసిపి పావులు కదపడం గమనార్హం.

సంతమాగులూరు: మండలంలో సోమవారం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అధికారపార్టీ నేతలు ఓట్లకు నోట్లు పంపిణీ చేశారు. గ్రామ వాలంటీర్ల ద్వారా పట్టభద్రులకు ఓటుకి వెయ్యి రూపాయల చొప్పున అందజేశారు.



జాతీయ రహదారి పక్కన మామిడి పండ్ల విక్రయం

గృహనిర్మాణాలు ముందుకు సాగేనా.?

ఉగాది నాటికి పూర్తి చేయాలంటూ లబ్ధిదారులపై అధికారుల ఒత్తిడి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఉగాది పండుగ నాటికి జగనన్న లే అవుట్‌లలో పక్కా గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారుల నుంచి లబ్ధిదారులపై ఒత్తిడి పెరిగింది. గ్రామ స్థాయి అధికారుల నుంచి జిల్లా స్థాయి అధికారులంతా ప్రస్తుతం పక్కాగృహాల నిర్మాణాలే లక్ష్యంగా సమీక్షలు, కాలనీల పర్యటనలు చేస్తున్నారు. కాలనీలలో నిర్మాణాలు మొదలు కానీ ఇంటి స్థలాలను పరిశీలించిన ఇందుకు కారణాలపై ఆరా తీస్తున్నారు. ఇంటి స్థలాలు ఉచితంగా ఇచ్చి, గృహ నిర్మాణాలకు అవసరమైన నిధులు, బ్యాంకుల నుంచి రుణాన్ని కూడా ప్రభుత్వమే అందిస్తున్నప్పటికీ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల లబ్ధిదారుల ఫించన్లు ఆపుతామని, ఇతర సంక్షేమ పథకాలు అందవని చెబుతూ ఎలాగైనా సరే పక్కా గృహ నిర్మాణాల టార్గెట్‌లు పూర్తి చేసేందుకు లబ్ధిదారుల వెంటపడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎన్ని పర్యాయాలు లబ్ధిదారులతో మాట్లాడినప్పటికీ గృహ నిర్మాణాలు మాత్రం ముందుకు సాగడం లేదు. జిల్లాలో మొత్తం 30,522 గృహాలు మంజూరు కాగా ఇప్పటి వరకు 6,253 గృహాల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. నేటికి 14,628 గృహాలు పునాది దశలోనే ఉన్నాయి. ఉగాది నాటికి గృహనిర్మాణాలు పూర్తి చేయాలన్న దిశగా అధికారులు లబ్ధిదారులపై ఒత్తిడి పెంచారు.

ఆర్థిక స్థోమత లేక ముందుకు సాగని గృహ నిర్మాణాలు

మనం కడుతున్నవి ఇళ్ళు కాదు, ఊళ్ళు అన్న నినాదంతో రాష్ట్రప్రభుత్వం పెద్ద ఎత్తున జగనన్న కాలనీలకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వమే ఇళ్ల కట్టిస్తుందన్న ఆశతో ఇల్లు లేని పేద, బలహీన వర్గాల వారందరూ పక్కాగృహాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. తీరా గృహాలు మంజూరయి నిర్మాణాలు ప్రారంభించాల్సిన దశలో ఇళ్లను లబ్ధిదారులే నిర్మించుకోవాలని ప్రభుత్వం చెప్పింది. ప్రభుత్వమే తమకు ఇళ్ల కట్టించి ఇస్తుందన్న ఆలోచనతో ఉన్న లబ్ధిదారులు తామే ఇళ్ల నిర్మించుకోవలసి రావడంతో సమస్యలు మొదలయ్యాయి. పక్కాగృహాల నిర్మాణం కోసం ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక చేయూతతో పాటు లబ్ధిదారులు కూడా కొంత మొత్తాన్ని భరించాల్సి ఉంది. ఇళ్ల మంజూరు పొందిన వారిలో అత్యధికులు పేదలు, రోజు వారీగా పనులకు వెళితేనే వారి కుటుంబ జీవనం సాగుతుంది. గృహ నిర్మాణ వ్యయం పెరగడంతో అంత మొత్తాన్ని వారు భరించే స్థోమత ఉండడం లేదు. దీంతో పాటు జిల్లాలో ఎక్కువ శాతం జగనన్న కాలనీలు లబ్ధిదారులు ప్రస్తుతం నివాసం ఉంటున్న ప్రాంతానికి దూరంగా ఉన్నాయి. దీంతో వారు రోజూ అంత దూరం వెళ్లి పక్కా గృహాలు నిర్మించుకోవడం అనేది ఆచరణ సాధ్యంగా లేదు.

మధురఫలం.. బహుప్రియం

ప్రజాశక్తి-పంగులూరు

'మధుర ఫలం' అని ఎంతో ఆప్యాయంగా పిలుచుకునే మామిడి పండ్లు ఈ సంవత్సరం ధరల పెరుగుదల కారణంగా సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోతున్నాయి. వేసవికాలం ప్రారంభం నుంచి మామిడికాయలు అందుబాటులోకి వస్తాయి. .ఫిబ్రవరి 15 నుంచి ఈ ప్రాంతంలో మామిడికాయలు అందుబాటులోకి వచ్చాయి. ఉలవపాడు నుంచి నాణ్యమైన మామిడికాయలను తీసుకువచ్చి జాతీయ రహదారిపై పెట్టి వ్యాపారులు అమ్ముతున్నారు. అయితే ప్రతి సంవత్సరం కొంత అందుబాటులో ఉన్నప్పటికీ ఈ సంవత్సరం మామిడికాయల ధరలు విపరీతంగా పెరిగాయని అంటున్నారు. డిసెంబర్, జనవరి నెలలో మామిడి పూత వస్తుంది. పూత వచ్చే కాలంలోనే మామిడి పూతకు తేనె మంచు పురుగు వ్యాపించడంతో, పూత, పిందె మొత్తం నల్లగా మారి, ఎదుగుదల లేకుండా రాలిపోయింది. అందువల్ల ఈ సంవత్సరం దిగుబడి చాలా తక్కువగా ఉందని చెబుతున్నారు. దీంతో వచ్చిన కొద్దిపాటి కాయలను వ్యాపారులు ధరలు పెంచి అమ్ముతుండటంతో సామాన్య ప్రజలు మామిడికాయలను కొనే పరిస్థితి కనపడటం లేదు. జాతీయ రహదారిపై పెట్టి అమ్మే కాయలను కేజీ రూ.250 నుంచి రూ.300 వరకు చెబుతున్నారు. ఒక కేజీకి మూడు నుంచి నాలుగు కాయలు మాత్రమే వస్తాయి. ఇంత ధరపెట్టి మామిడి కాయలను కొనలేమని ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఏది ఏమైనా సామాన్య ప్రజానీకం అత్యంత ప్రీతిపాత్రంగా తినే మామిడికాయలు ఈ సంవత్సరం పెరిగిన ధరలతో అందుబాటులో లేకుండా పోతున్నాయని అంటున్నారు.

అటవీ భూముల్లోని అరుదైన జాతుల సంరక్షణ కోసం కృషి

జిల్లా అటవీశాఖాధికారి ఎల్.భీమయ్య

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లా పరిధిలో 9,198 హెక్టార్లలో అటవీ భూములున్నాయి. అడవుల సంరక్షణతో పాటు ఇందులో ఉన్న పలు రకాల జీవులను పరిరక్షించు కోవడం, మడ అడవుల రక్షణ చర్యలు చేపడుతున్నట్లు జిల్లా అటవీశాఖాధికారి ఎల్ భీమయ్య తెలిపారు. జిల్లాలోని అటవీ భూములు సూర్యలంక తీర ప్రాంతం అరుదైన జాతులకు ఆవాసంగా ఉన్న నేపథ్యంలో వాటితో పాటు ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యల గురించి ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు. నేటి ఆధునిక కాలంలో కాలక్రమేణా పలు రకాల చెట్లు అంతరించి పోవడంతో పాటు అటవీ భూముల విస్తీర్ణం తగ్గిపోతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యం కోసం సమిష్టి కృషి చేయాల్సి ఉంది. జిల్లా పరిధిలో సముద్రతీర ప్రాంతం 74 కిలోమీటర్ల మేర ఉంది. తీర ప్రాంతంలో అధికంగా అటవీ భూములున్నాయి. వీటితో పాటు జిల్లా పరిధిలో విస్తారంగా ఉన్న మడ అడవులు సముద్రం నుంచి వచ్చే ఆటుపోటులకు తీరం కోతకు గురికాకుండా రక్షించడంతో పాటు పలు అరుదైన జాతులకు ఆవాసంగా ఉంది.

ఆలివ్ రిడ్లే తాబేళ్ల రక్షణ చర్యలు

అంతరించి పోతున్న జీవుల జాబితాలో ఉన్న ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ కోసం విస్తృతంగా చర్యలు చేపట్టారు. జిల్లాలోని చినగంజాం, పెదగంజాం, లంకెవానిదిబ్బ తీరప్రాంతానికి ఈ తాబేళ్లు ప్రతి సంవత్సరం నవంబరు నుంచి మార్చి వరకు వచ్చి గుడ్లు పెడతాయి. ఈ గుడ్లను సేకరించి పొదిగించి వాటి నుంచి పిల్లలు వచ్చాక క్షేమంగా వాటిని సముద్రంలో విడిచిపెట్టే కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఇందుకోసం జిల్లాలోని బాపట్ల, రేపల్లె, పెదగంజాంలలో ఐదు హేచరీలను పెట్టారు. తాబేళ్లు ఇలా గుడ్లు పెట్టేందుకు వచ్చిన సమయంలో అవి తిరిగి వెళ్లే సమయంలో మత్స్యకారులు చేపల వేట కోసం సముద్రం తీరంలో వేసి ఉన్న వలల్లో చిక్కి చనిపోతున్నాయి. అలాంటి సమయాల్లో తాబేళ్ల రక్షణ గురించి మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్నారు. తాబేళ్లు గుడ్లు పెట్టే ప్రాంతాలను గుర్తించి వాటిని రక్షిత ప్రాంతాలుగా ప్రకటించి రక్షణ చర్యలు చేస్తున్నారు. ఇలా ఏటా 25 వేలకు పైగా ఆలివ్ రిడ్లే తాబేళ్లను సంరక్షించి సురక్షితంగా సముద్రంలో విడిచిపెడుతున్నారు.

అరుదైన జాతుల సంరక్షణ



జిల్లాలోని సముద్రతీరం మడ అడవులు పలు రకాల అరుదైన జాతులకు ఆవాసాలుగా ఉన్నాయి. పులి లాంటి క్రూరమృగాలు ఈ ప్రాంతంలో లేవు. జంగు పిల్లులు, అడవి పందులు, నక్కలు, నీటి పిల్లులు, నీటి కుక్కలు, కుందేళ్లు ఉన్నాయి. కొందరు ఇక్కడి అటవీ ప్రాంతంలో పులులు తిరుగుతున్నట్లు భావిస్తున్నారు కాని అవి జంగు పిల్లులు. బలిష్టంగా ఉన్న జంగు పిల్లులు చూడడానికి పులి లాగా ఉంటాయి. గతంలో కొత్తపాలెం, దిండి అడవుల్లో ఉన్న జంగు పిల్లులు ఇటీవలి కాలంలో సూర్యలంక అటవీ ప్రాంతంలోకి వస్తున్నాయి. ప్రజలు వీటిని చూసి పులులు అనుకుంటున్నారు. గతంలో ఇక్కడ జింకలు కూడా ఉండేవి కాని ప్రస్తుతం వాటి జాడ లేదు. అటవీ భూముల్లో వేట నిషేధం ఉంది. ఇక్కడి జీవాలను ఎవరు వేటాడినా చర్యలు తీసుకుంటాం.

చీరాల, బాపట్లలో నగర వనాలు

సముద్రతీర ప్రాంతానికి వచ్చే పర్యాటకులు సేదతీరేందుకు బాపట్ల, చీరాల పట్టణాలకు సమీపంలో సముద్రతీర మార్గంలో నగరవనాలను ఏర్పాటు చేశాం. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు, సమీప పట్టణంలోని ప్రజలు పచ్చదనం మధ్య సేద తీరేందుకు ఈ నగర వనాలను రూపకల్పన చేశాం. బాపట్లలో ఉన్న నగరవనం అందుబాటులోకి వచ్చింది. చీరాలలో ఏర్పాటు చేసిన నగరవనం పనులు పూర్తి చేయాల్సి ఉంది. లోపల వివిధ జాతుల మొక్కలు పెంచడంతో పాటు, పచ్చదనం పరచాలి. పిల్లలు ఆడుకునే పరికరాలు, పర్యాటకులు విడిది చేసేందుకు గదులు, తినుబండారాల శాలల నిర్మాణం జరగాల్సి ఉంది. ఇవన్నీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చే కృషి చేస్తున్నాం. తీరప్రాంతంలో అటవి భూముల్లో ప్లాస్టిక్ వాడకంపై నిషేధం ఉంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇక్కడకు వచ్చే పర్యాటకులు కూడా ప్లాస్టిక్ వ్యర్థాలను ఇక్కడి అడవుల్లో తీరంలోని అటవీ భూముల్లో పడేయకుండా పర్యావరణం పట్ల అవగాహనతో ఉండాలి. అడవుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి కాలుష్య కారకాలుగా మారుతున్న క్రమంలో చీరాల, రేపల్లెలో ఉన్న అటవీ శాఖ రేంజ్ కార్యాలయాల ద్వారా అడవుల సంరక్షణ చర్యలు చేపడుతున్నాం.

పోలింగ్ బూత్‌ల వద్ద పటిష్ట బందోబస్తు

- నిర్వహణపై ఎస్‌పి వీడియో కాన్ఫరెన్స్- పలు కేంద్రాలను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-అద్దంకి

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ నేతృత్వంలో నేడు జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన భద్రత, బందోబస్తు అవగాహనపై జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఏఎస్‌పి మహేష్, పోలీసు అధికారులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో ఏఎస్‌పి మహేష్ ఆధ్వర్యంలో పోలీసు అధికారుల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భం గా ఏఎస్‌పి మహేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని 5 మండలాల్లో ఉన్న పోలింగ్ బూత్‌ల వద్ద పోలీస్ అధికారులు బందోబస్తు, పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ స్టేషన్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని, పోలీసులు పోలింగ్ అధికారి సూచనలు పాటిస్తూ ఉండాలని అన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటలు వరకు పోలింగ్ జరుగుతుందని, గంట గంటకూ స్ట్రైకింగ్ ఫోర్స్ పోలీసులు సైరన్ మోగిస్తూ హడావుడిగా ఉండాలని హెచ్చరించారు. బ్యాలెట్ బాక్సుల వద్ద సంబంధించిన పోలీస్ అధికారులు 24 గంటలు కట్టుదిట్టమైన కాపలా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఎన్నికల కోడ్‌ని ఉల్లంఘించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటా మని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో బాపట్ల, చీరాల రూరల్, అద్దంకి సిఐలు వేణుగోపాల్ రెడ్డి, సోమశేఖర్, రోశయ్య, నియోజకవర్గంలోని అన్ని పోలీసు స్టేషన్ల ఎస్ఐలు, మహిళా ఎస్ఐలు, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్: సోమవారం జరగుతున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బందోబస్తు నిర్వహించామని ఇంకొల్లు సిఐ వి సూర్యనారాయణరావు తెలిపారు. మొత్తం 60 మంది సిబ్బందితో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున పోలింగ్ బూత్‌కి కాని లొకేషన్‌కి కాని ఓటర్లు తప్ప వేరే వారికి అనుమతి లేదని మరియు అనవసరంగా సమావేశాలు జరపకూడదని పేర్కొన్నారు. మద్యం మరియు డబ్బులు పంచకుండా ఎక్కడికక్కడ చెసింగ్ పాయింట్లు వేసినట్లు తెలిపారు. ఇంకొల్లు సర్కిల్ పరిధిలోని ఇంకొల్లు, చిన్నగంజాం, కారంచేడు మండలాలలోని ఓటర్లు ప్రశాంతమైన వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సిఐ సూర్యనారాయణ కోరారు.



బల్లికురవ పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎఎస్‌పి

పంగులూరు: ఈ నెల 13వ తేదీ సోమవారం నాడు జరగనున్న శాసనమండలి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికల సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం అడిషనల్ ఎస్పీ మహేష్ మండల కేంద్రమైన పంగులూరులోని పోలింగ్ బూత్‌ను పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల దగ్గర భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఓటర్లకు అసౌకర్యం లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా పోలింగ్ బూత్‌లు ఉన్నాయా, లేదా అని పరిశీలించారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని, ఎలాంటి అపోహలకు గురికావద్దని సిబ్బందికి అడిషనల్ ఎస్పీ మహేష్ సూచించారు. కట్టుదిట్టమైన ఏర్పాట్లను సిబ్బంది చేశారా లేదా అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రేణింగవరం ఎస్ఐ తిరుపతరావు ఉన్నారు.

బల్లికురవ రూరల్: నేడు జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాలను అడిషనల్ ఎస్పీ పి మహేష్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఓటు ఉన్నవాళ్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించు కోవచ్చని అన్నారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈయన వెంట సీఐ రోశయ్య, ఎస్ఐ వేమన ఉన్నారు.

మద్దిపాడు: ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ సోమవారం స్థానిక కడియాల యానాదయ్య జునియర్ కాలేజీలో జరుగనున్నట్లు తహసీల్దారు జె లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలో పట్టభద్రులు 1,346 మంది, ఉపాధ్యాయులు 91 మంది తమ ఓటును నమోదు చేసుకున్నట్లు తెలిపారు. పట్టభద్రులకు 58-58ఏ గదులు కేటాయించినట్లు తెలిపారు. 58 గదిలో 700 మంది తమ ఓటు హక్కును వినియోగించుకొంటారని పేర్కొన్నారు. 58ఎ గదిలో 646 మంది తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని తెలిపారు. ఉపాధ్యాయులకు 33వ నంబర్ గది కేటాయించినట్లు తెలిపారు. 91మంది ఓటు నమోదు చేసుకున్నట్లు వివరించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వీరి వెంట, ఆపరేటర్ బొంత మరియదాసు, విఆర్ఒ రమణమూర్తి, సిబ్బంది ఉన్నారు.

సంతనూతలపాడు రూరల్: స్థానిక జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎన్నికల జోనల్ ఆఫీసర్ కే కృష్ణమోహన్ ఒంగోలు రూరల్ సర్కిల్ ఎలక్షన్ ఇన్‌ఛార్జి డి మల్లికార్జునరావు ఆదివారం పరిశీలించారు. స్థానిక హైస్కూల్లో మొత్తం మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టభద్రుల కోసం 50, 51 కేంద్రాలను, ఉపాధ్యాయుల కోసం 28 పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో 2,324 పట్టభద్రులు, 181 మంది ఉపాధ్యాయులు తమఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ బి శ్రీకాంత్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దారు, ఏఈఆర్ఓ శీలం శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అద్దంకిలో మాట్లాడుతున్న పోలీసు అధికారులు


ఇంకొల్లులో సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్ఐ నాయబ్ రసూల్

వాలంటీర్లు, గృహసారథులకు సమన్వయం అవసరం: మోపిదేవి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

గ్రామ వాలంటీర్లు, నూతనంగా నియమితులైన గృహ సారథులు, గ్రామ కన్వీనర్లు, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. నూతనంగా నియమించబడిన గృహ సారథుల అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం చెరుకుపల్లిలో నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. గృహసారథులు తమకు కేటాయించిన, ప్రతి గృహానికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించాలని, తద్వారా రాబోయే ఎన్నికలలో మనకు లాభం చేకూరేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మార్చి 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు గృహసారథులు



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న మోపిదేవి

కేటాయించిన ప్రతి గృహాన్ని సందర్శించి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి, గత ప్రభుత్వానికి ప్రస్తుత మన ప్రభుత్వానికి గల తేడా వివరించాలని, పార్టీతో సంబంధం లేకుండా ప్రస్తుత ప్రభుత్వంలో కేటాయించిన పథకాల వలన ప్రతి ఒక్కరూ లబ్ధి పొందారని, తద్వారా మన ప్రభుత్వాన్ని గెలిపించే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు మత్తి దివాకర్ రత్న ప్రసాద్, చీరాల ప్రసాద్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పయనం ఏడుకొండలరెడ్డి, ఆరుంబాక గ్రామ సర్పంచ్ కామినేని కోటేశ్వర రావు, చెన్ను కోటేశ్వరరావు, రావూరి శివ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు: కలెక్టర్

చీరాలలో పోలింగ్ బూత్ పరిశీలన ● సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ ● పటిష్ట భద్రతకు ఆదేశం

ప్రజాశక్తి-చీరాల

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు అధికారులు అందరూ బాధ్యతగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. ఆదివారం చీరాల ఎన్ఆర్‌పిఎం హైస్కూలో ఎమ్మెల్సీ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల13వ తేదీన జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పోలింగ్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల విధులను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎమ్మెల్సీ పోలింగ్ సమయంలో అనుమానాలు వస్తే రాతపూర్వంగా తెలియజేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో పిఒలు తప్పకుండా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్‌ను నిర్వహించాల న్నారు. పోలింగ్ అనంతరం పోలింగ్ కేంద్రాల నుంచి రూట్ ఆఫీసర్ల సాయంతో పోలింగ్ సామగ్రిని రిసెప్షన్ కేంద్రానికి తీసుకురావాలని ఆమె అన్నారు. రిసెప్షన్ కేంద్రాల వద్ద ఎన్నికల సామగ్రి పూర్తిగా అప్పగించిన తరువాత మాత్రమే వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి కె లక్ష్మీ శివ జ్యోతి, చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారి సరోజిని, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి రవీంద్ర, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకష్ణన్

ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహణ

పోలింగ్ కేంద్రంలోకి వెళ్లే ఓటర్లు, ఏజెంట్లను క్షుణ్ణంగా తనిఖీ చేస్తాం ● 144 సెక్షన్ అమలు ● ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-చీరాల

ఎన్నికలను ప్రశాంతంగా జరగాలంటే ఎన్నికల విధులలో ఉన్న పోలీస్ సిబ్బంది ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ ఆదేశించారు. జిల్లాలో జరగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలీసు అధికారులు మరియు సిబ్బందికి ఆదివారం చీరాల ఎన్ఆర్‌పిఎం హైస్కూల్‌లో చీరాల, పర్చూరు నియోజక వర్గాలలో విధులు నిర్వహించే పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో ప్రత్యక్షంగానూ, అద్దంకి నియోజక వర్గంలో విధులు నిర్వహించే అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన బ్రీఫింగ్ నిర్వహించి ఎన్నికలకు సంబంధించిన విధివిధానాలపై మాట్లాడారు. 13న ఉదయం8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలోని 13 మండలాల్లో జరుగుతాయన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి తగినంత మంది పోలీస్ సిబ్బంది, అధికారులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి స్ట్రైకింగ్ ఫోర్స్‌కు సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఒను అధికారిగా నియమించామన్నారు. ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల సారథ్యంలో క్యూఆర్‌టి టీమ్‌లు పనిచేస్తుంటాయన్నారు. స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌కు అడిషనల్ ఎస్పీ, డిఎస్‌పి స్థాయి అధికారుల సారథ్యంలో పనిచేస్తూ ఉంటాయన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది సంబంధిత రూట్ ఆఫీసర్, క్విక్ రియాక్షన్ టీమ్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారుల ఫోన్ నెంబర్లు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో సున్నంతో గీతాలు వేయించాలని, ఎవరైతే ఓట్లు వేయడానికి వస్తారో వారు ఓటు హక్కు వినియోగించుకున్న తరువాత అక్కడ ఉండకుండా చూడాలన్నారు. ఎమ్మెల్సీ ఎలక్షన్లు జరిగే ప్రాంతాలలో 144 సిఆర్‌పిసి సెక్షన్ అమలులో ఉన్నందున ఎవరూ గుంపులు గుంపులుగా చేరనీయకూడదన్నారు. సామగ్రికి ఎస్కార్ట్‌గా వెళ్లి ఈరోజు నుంచి రేపు పోలింగ్ ముగిసిన తరువాత బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్‌కు చేరేంతవరకు అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. లాడ్జిలను, హోటళ్లను తనిఖీ చెయ్యాలన్నారు. చెక్ పోస్టలలో ప్రతి ఒక్క వాహనాన్ని తరువుగా తనిఖీ చేసి క్యాష్, లిక్కర్ మరియు ప్రజలను ప్రలోభాలకు గురిచేసే ఇతర వస్తువులను నియంత్రించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి మహేష్, బాపట్ల డిఎస్‌పి ఏ శ్రీనివాసరావు, చీరాల డిఎస్‌పి పి శ్రీకాంత్, రేపల్లె డిఎస్‌పి టి మురళీకృష్ణ, డిఎస్‌బి ఇన్‌స్పెక్టర్ ఏ శ్రీనివాస్, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకూల్ జిందాల్

ప్రత్యేక బందోబస్తు చర్యలు

జిల్లాలోని 13 మండలాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి పటిష్ట పోలీస్ భద్రత ఏర్పాటు చేశామని ఎస్‌పి తెలిపారు. ఒక అడిషినల్ ఎస్పీ, ఇద్దరు డిఎస్పీలు, 8 మంది ఇన్‌స్పెక్టర్‌లు, 40 మంది ఎస్ఐలు, 20 మంది ఏఎస్ఐలు, 95 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 367 మంది కానిస్టేబుళ్లు, 68 మంది హెూమ్ గార్డులు, 98 మంది ఆర్మ్‌డ్ ఫోర్స్ మొత్తం 697 మంది పోలీస్ సిబ్బంది మరియు అధికారులతో పాటు 3 సెక్షన్ల ఏపీఎస్‌పీ బలగాలను వినియోగిస్తున్నామన్నారు. ప్రతి మండలంలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లను నియమించామన్నారు. 13 స్ట్రైకింగ్ ఫోర్స్‌లను, 7 క్విక్ రియాక్షన్ టీమ్‌లను, 3 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా, ఏదైనా అవాంఛనీయ ఘటన చోటు చేసుకోవడానికి అవకాశం ఉన్నదన్న సమాచారం తెలిసిన వెంటనే స్ట్రైకింగ్ ఫోర్స్, క్విక్ రియాక్షన్ టీములు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లు ఆ ప్రదేశానికి చేరుకుని సమస్యను పరిష్కరించి, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-బాపట్ల: నిరుపేదలకు సహాయం అందించడంలో నిజమైన సంతృప్తి ఉందని జర్మనీ దేశస్థుడు టోనీ బ్రౌన్ అన్నారు. ఆదివారం బాపట్ల పట్టణంలో బేతనీ కాలనీలో కుష్టు వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు పంపిణీ చేశారు. యాదవపాలెంలో విద్యార్థులకు గోడ గడియారాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా టోనీ మాట్లాడుతూ గత 20 యేళ్లుగా జర్మనీ నుంచి భారతదేశాన్ని సందర్శించడంలో భాగంగా ప్రధానంగా బాపట్లలో పేదవారికి అనేక సేవా కార్యక్రమాలతో పాటు ఉచిత వైద్య శిబిరాలు, అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి టోనీ బ్రౌన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తోటా మల్లేశ్వరి, బొంతగోర్ల వెంకట్రావు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం


అన్నా క్యాంటిన్లో అన్నదాన దృశ్యం

అన్న క్యాంటీన్‌కు 133 రోజులు

ప్రజాశక్తి-బాపట్ల

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బాధ్యులు వేగేశన నరేంద్రవర్మ బాపట్లలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ 133వ రోజుకు చేరింది. తాజాగా ఆదివారం తెలుగుదేశం పార్టీకి చెందిన కీర్తి వెంకట ప్రసన్న, వెంకట ప్రవీణ పుట్టినరోజు సందర్భంగా లక్ష్మీనారాయణ సహకారంతో దాదాపు 250 మంది పేదలకు అన్న వితరణ చేశారు. పేదల ఆకలి తీర్చే బృహత్తర కార్యక్రమానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ నరేంద్రవర్మ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దాతలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


నూతలపాడులో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-పర్చూరు

వృద్ధాశ్రమాల్లో ఉండే అవ్వ తాతలకు సహాయం చేయటంలో గొప్ప ఆనందంతో నిండిన తృప్తి ఉంటుంది అని ట్రయిఉఫెన్స్ ట్రస్ట్ చైర్మన్ బిసి కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నూతలపాడు గ్రామంలో ఆశ్రయ వృద్ధుల ఆశ్రమాన్ని సందర్శించారు. ఆశ్రమంలో 25 మంది ఉంటున్న వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ యాజమాన్యం బిసి కుమార్ భవనం శ్రీనివాసరెడ్డి, జయలక్ష్మిలకు కృతజ్ఞతలు తెలిపారు.


గంగపుత్రులకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

గంగపుత్రులకు కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి-బాపట్ల

తీర ప్రాంత జాలర్ల నేత్ర సమస్యలను నివారించేందుకు అవసరమైన కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ అన్నారు. ఆదివారం బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాపట్ల మండలం ముత్తాయపాలెంలో గతవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ తీర ప్రాంత గ్రామాల్లో గంగపుత్రులు, మత్స్యకార కుటుంబాలే లక్ష్యంగా నిర్వహించిన ఈ శిబిరానికి మంచి స్పందన లభించిందన్నారు. మొత్తం 702 మందికి గతవారం నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి 504 కళ్ళజోళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. తీర ప్రాంత గ్రామాల్లో ఇప్పటివరకు ఏడు ఉచిత వైద్యం కంటి వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్న సూక్తి స్ఫూర్తిగా నేత్ర జ్యోతి కార్యక్రమం పెద్దఎత్తున చేపట్టామని తెలిపారు. ఇప్పటికే 6 వేల7వందల మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి, 4 వేల 8 వందల మందికి కళ్లజోళ్లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు కళ్లం హరినాథ రెడ్డి, బజరంగ్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపిలో గ్రూపుల్లేవు..

- అంతా జగనన్న గ్రూపే..
- అందరినీ ఒక తాటిపైకి తీసుకొచ్చే బాధ్యత నాదే..
- మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

'పార్టీలో వర్గాలు ఉన్నాయి.. గ్రూపులు ఉన్నాయి.. అంటూ ప్రచారం జరుగుతోంది.. అలాంటివి ఏమీ లేవు.. అందరి ఆలోచన ఒకటే.. జగనన్నను సిఎం చేయడమే..' అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. ఆదివారం వైసిపి 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యర్రగొండపాలెంలోని వైసిపి కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా మంత్రిమ సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. యర్రగొండపాలెంలో భారీ మెజారిటీతో గెలిపించుకొని జగనన్నకు గిఫ్టుగా ఇవ్వాలని చెప్పారు. అందరినీ కలుపుపోయి ఒక తాటిపై తీసుకొచ్చే బాధ్యత తనదని మంత్రి సురేష్ హామీ ఇచ్చారు. మనలో ఎలాంటి పొరపొచ్చాలు లేవన్నారు. ఇక్కడ గ్రూపులు, గీపులు జాంతానై అని మనమందరం జగనన్న గ్రూపు అని తెలిపారు. రాబోయే రోజుల్లో అందరం కలిసికట్టుగా నియోజకవర్గంలో వైసిపి సత్తా చాటాలన్నారు. పార్టీకి ఒకరు తక్కువ, ఒకరు ఎక్కువ కాదని చెప్పారు. పార్టీకి వెన్నెముకలా పనిచేసే ప్రతిఒక్కరూ సమానమేనన్నారు. పార్టీ తల్లి లాంటిదని తల్లిని గౌరవించాలే తప్ప దూషించకూడదని తెలిపారు. తెలుగుదేశం పార్టీలో సాక్షాత్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చం నాయుడే 'పార్టీ లేదు.. బొక్క లేదు' అనడం మనం విన్నామన్నారు. అది ఆ పార్టీకే చెల్లిందన్నారు. సమావేశంలో ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, జడ్పిటిసి చేదూరి విజయ భాస్కర్, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ రామావత్ అరుణాబాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

పోలీసుల అదుపులో ఒక నిందితుడు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీ లోని 'బాపూజీ కాలనీలో క్రూర మృగాళ్లు' అనే శీర్షికతో ప్రజాశక్తి మినీలో ఆదివారం వెలువడిన కథనంపై పోలీసులు స్పందించారు. స్థానిక బాపూజీ కాలనీలో జరుగుతున్న కిరాతకాలపై మార్కాపురం పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు. ఎఎస్ఐ మున్నాఫ్, పోలీసు సిబ్బంది దాడులకు పాల్పడుతున్న శ్రీరాం శ్రీను అలియాస్ గానుగాడు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారి కోసం గాలిస్తున్నట్లు తెలిసింది.

ఎన్నికలకు మూడు పోలింగ్ కేంద్రాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు గానూ ఉపాధ్యాయులు ఎన్నికలు వేసేందుకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ కె రవీంద్రారెడ్డి ఆదివారం తెలిపారు. అందులో 63 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు పేర్కొన్నారు. పట్టభద్రుల కోసం రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రూం నెంబర్ 3లో 700 మంది, రూమ్ నెంబర్ 3ఏలో 705 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు

- పోలింగ్ సమయంలో.. అప్రమత్తంగా వ్యవహరించాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరిక
- ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



టెక్నాలజీ గురించి తెలుసుకుంటున్న కలెక్టర్



ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పజాశక్తి-మార్కాపురం

తూర్పు, రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం జరగనున్నాయి. ఈ పోలింగ్ సమయంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ స్థాయి ఎమ్మెల్సీ ఎన్నికల సామగ్రి పంపిణీ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు, సిబ్బందితో కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని సదుపాయాలూ కల్పించాలని చెప్పారు. విధుల నిర్వహణలో సందేహం వస్తే ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల సంఘం ఇచ్చిన హ్యాండ్‌బుక్‌లో ఉన్న నిబంధనల ప్రకారం వ్యవహరించాలని చెప్పారు. ఏమైనా సహాయం అవసరమైతే ఉన్నతాధికారుల దష్టికి తీసుకువెళ్లాలని, జిల్లా కేంద్రంలో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను కూడా సంప్రదించవచ్చని అన్నారు. అనంతరం మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కేటాయించిన పోలింగ్ కేంద్రంలో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ విధులలో పాల్గొనే సిబ్బందికి, పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులకు చెప్పారు. శుభ్రమైన తాగునీరు, టాయిలెట్లు కల్పించడంతో పాటు ఓటర్లకు అవసరమైన సమాచారం ఇచ్చేలా హెల్ప్ డెస్కు ఏర్పాటు చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రంలో అనవసరమైన రద్దీని నియంత్రించేలా ఓటర్లను వరుసలో నిలుచునేలా సమర్ధవంతంగా పర్యవేక్షించాలని చెప్పారు. పోలింగ్ సామగ్రిని డిస్ట్రిబ్యూషన్ చేస్తున్న విధానాన్ని సబ్ కలెక్టర్ సేతు మాధవన్ ఈ సందర్భంగా కలెక్టరు దినేష్‌కుమార్‌కు వివరించారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

ఒంగోలు కలెక్టరేట్: జిల్లాలో ఎమ్మెల్సీలు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఒంగోలు డివిజన్ కు సంబంధించి ఒంగోలులోని పి.వి.ఆర్. బాలుర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కూడా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఎన్నికల సామాగ్రిని తీసుకున్నప్పటి నుంచి పోలింగ్ ముగిశాక వాటిని తిరిగి రిసెప్షన్ కేంద్రాలకు తరలించే వరకు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆయన సూచించారు. కాగా, సిబ్బందికి వీటిని అప్పగించి బస్సులలో తరలించేందుకు తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా ఆర్డీవో విశ్వేశ్వరరావు కలెక్టర్‌కు వివరించారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



టెక్నాలజీ సాయంతో ఎన్నికల నిర్వహణకు సమాయత్తమవుతున్న విద్యార్థులు



బ్యాలెట్ బాక్సులను పోలింగ్ కేంద్రాలకు పంపుతున్న కలెక్టర్



మార్కాపురంలో ఎన్నికల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు

జేసీ అభిషిక్త్‌కిశోర్

ప్రజాశక్తి-కనిగిరి

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని జేసీ అభిషిక్త్ కిషోర్ హెచ్చరించారు. కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియను ఆయన ఆదివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలో చేసిన ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించి ఎన్నికల సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఎన్నికల విధులకు హాజరుకాకపోతే సస్పెండ్ చేస్తామని హెచ్చరిం చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్డీవో కె.సందీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జేసీ అభిషిక్త్‌కిశోర్

ఘనంగా 'విశ్వభారతి' వార్షికోత్సవం

ప్రజాశక్తి-దొనకొండ

స్థానిక విశ్వభారతి విద్యాలయం 6వ వార్షికోత్సవాన్ని కరస్పాండెంట్ మల్లెల రామిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డీఎస్పీ నారాయణ స్వామిరెడ్డి, ఎంపీపీ బొరిగొర్ల ఉషా మురళీ, ఎంఈఓ ఎన్.సాంబశివ రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విశాలమైన మైదానం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విశ్వభారతి విద్యాలయం మంచి విద్యా వాతావరణం కలిగి ఉందన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ గడచిన 6 ఏళ్లల్లో పాఠశాల యాజమాన్యం రాజీ లేని విద్యా ప్రమాణాలు, క్రమ శిక్షణ అందించటంతో దొనకొండలోనే ఉత్తమ ప్రవేటు పాఠశాలగా రూపుదిద్దుకుందని తెలిపారు. కరస్పాండెంట్ రామిరెడ్డి మాట్లాడుతూ ప్రతినెలా తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి పిల్లల చదువులపై ఆరా తీసి అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీచర్లు పాల్గొన్నారు.



స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో చిన్నారులు



మాట్లాడుతున్న డీఎస్పీ

వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

వైఎస్ఆర్ కాంగ్రెసు పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగాయి. పార్టీ జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కేక్ కత్తిరించారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఎఎంసి మాజీ చైర్మన్ అయినా బత్తిన ఘనశ్యాం, నగర నాయకులు కఠారి శంకర్, కండె రమణాయాదవ్, దామరాజు క్రాంతికుమార్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, పురిణి ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చీమకుర్తి పార్టీ ఆఫీస్‌లో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే టి.జె.ఆర్ సుధాకర్‌బాబు, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

పొదిలి: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక పొదిలి పార్టీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పార్టీ జెండాను ఎగరవేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మండల, పట్టణ వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దోర్నాలలో మండల పార్టీ కన్వీనర్ ఘంటా రమణారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి.. ఘనంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, వైస్ ఎంపిపి దర్శనం నాగయ్య, నాయకులు గుమ్మా యల్లేష్, ఉప సర్పంచ్ రసూల్, అల్లూ రమణారెడ్డి, సుబ్బారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

శింగరాయకొండ: వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం నాడు శింగరాయకొండ వైసీపీ కార్యాలయంలో నిర్వహించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కొండేపి నియోజకవర్గ ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు హాజరయ్యారు. ముందుగా వైసిపి జెండాను ఆవిష్కరణ చేసి.. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సామంతుల రవికుమార్‌రెడ్డి, యనమల మాధవి, షేక్ సలీం, ఎస్‌కే సలీంభాష, ఎస్‌కే పటేల్, తన్నీరు సుబ్బారావు ఉన్నారు.



ఒంగోలులో కేక్ కట్ చేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి



చీమకుర్తిలో కేక్ కట్ చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, టిజెఆర్

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు: కమిషనర్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఈ వేసవిలో ఒంగోలు నగర ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. రామతీర్థం జలాశయం నుంచి ఒంగోలులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకు విడుదల అవుతున్న నీటి తీరువను ఆదివారం ఆయన పరిశీలించారు. ఒకటి, రెండు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పరిశీలించి ఇప్పటి వరకు చెరువులకు వచ్చిన నీటి సామర్థ్యం వివరాలను సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం రెండు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను సాగర్ జలాలతో 71శాతం నింపడం జరిగిందన్నారు. మరో పది రోజుల్లో రెండు జలాశయాలను వందశాతం నీటితో నింపడం జరుగుతోందన్నారు. ఈవేసవిలో నగర ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాదని స్పష్టం చేశారు. కమిషనర్ వెంట ట్యాప్ ఇన్స్‌పెక్టర్ నరసింహారావు, తదితరులు ఉన్నారు.

బోర్డు స్కూలులో ఎమ్మెల్సీ ఎన్నికల బూత్‌లు ఏర్పాటు

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక తహశీల్దార్ కార్యాలయం రోడ్డులోని బోర్డు స్కూలు(జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల)లో ఎమ్మెల్సీ ఎన్నికల బూతులు ఏర్పాటుచేసినట్లు తహశీల్దార్ పిన్నికమధుసూధనరావు తెలిపారు. పాఠశాలలోని రూమ్ నంబర్ 1లో పట్టభద్రుల పోలింగ్‌స్టేషన్ 52ను, రూమ్ నంబర్ 4లో పట్టభద్రుల పోలింగ్‌స్టేషన్ 53ను ఏర్పాటు చేశారు. రూమ్ నంబర్ 2లో ఉపాధ్యాయ పోలింగ్ స్టేషన్ 29ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో సచివాలయ సిబ్బంది పంపిణీ చేసిన ఓటర్ల స్లిప్పులలో ఎన్నికల బూతులు జెహెచ్ఎస్(ప్రభుత్వ ఉన్నత పాఠశాల)లో ఏర్పాటు చేసినట్లు తప్పుగా నమోదైంది. మార్పును ఓటర్లు గమనించగలరు.



పిచ్చి చెట్లను తొలగిస్తున్న సెక్యూరిటీ గార్డులు

కూలీలుగా సెక్యూరిటీ గార్డ్స్

గ్రోత్‌సెంటర్‌లో పరిస్థితి ఇదీ..

ప్రజాశక్తి-గ్రోత్‌సెంటర్

'మేము చెప్పిన ప్రతి పని తప్పకుండా చేయాలి...అలా చేయకపోతే మిమ్మల్ని విధుల నుండి తొలగిస్తాం...డ్యూటీ టైంలో ఆఫీసు దగ్గర ఉండకూడదు...రోడ్డు మీదనే తిరుగుతూ ఉండాలి. విధుల్లోకి హాజరైన వెంటనే కత్తులు, కర్రలు చేత పట్టుకుని పిచ్చి చెట్లను నరకడంలో నిమగ్నం అవ్వాలి..' ఇదీ ఔట్‌సోర్సింగ్ సెక్యూరిటీ గార్డ్స్ పట్ల అధికారులు వ్యవహరిస్తున్న తీరు. మద్దిపాడు మండలంలో గల పారిశ్రామికవాడైన గుళ్లాపల్లి గ్రోత్‌సెంటర్‌లో ఎపిఐఐసిలో ఔట్‌సోర్సింగ్ విభాగంలో 13 మంది సెక్యూరిటీ గార్డ్స్‌గా పని చేస్తున్నారు. వీరు దాదాపు పదేళ్లకు పైగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. అయితే కొన్ని నెలలుగా వారు అసలు పని కంటే ఇతరత్రా పనుల్లో ఎక్కువగా కనిపిస్తున్నారు. ప్రస్తుతం వారు విధులకు హాజరైన కొద్దిసేపటికే కత్తులు, కర్రలు చేతపట్టుకుని ఎక్కడ పిచ్చి చెట్టు ఆగుపడితే అక్కడ వాటిని తొలగించే పనిలో నిమగ్నమవుతున్నారు. మేము ఈ పని చేయబోమని ఎవరైనా సెక్యూరిటీ గార్డులు అంటే 'మేము చెప్పింది చేయడమే మీ పని లేకపోతే మిమ్మల్ని తీసేసి వేరే వాళ్లను పెడతాం' అనే సమాధానం అధికారుల నుంచి వస్తోంది. చేసేది లేక అధికారులు ఏ పని చెప్పినా చేయాల్సి వస్తోందని పలువురు సెక్యూరిటీ గార్డ్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెక్యూరిటీ చేత పనులు చేయించుకుని అధికారులు బిల్లులు పెట్టుకుని కాజేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దొంగ ఓట్లు వేసేందుకు వస్తే కేసు

పొన్నలూరు తహశీల్దార్ సైలేంద్రకుమార్

ప్రజాశక్తి-శింగరాయకొండ

శాసనమండలి ఎన్నికల్లో దొంగ ఓట్లు వేయడానికి వస్తే కేసులు నమోదు చేస్తామని పొన్నలూరు తహశీల్దార్ సైలెంద్రకుమార్ 'ప్రజాశక్తి'తో చెప్పారు. ఇటీవల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల జాబితాలో బోగస్ ఓట్లు నమోదయ్యాయి. శింగరాయకొండ మండలం, మూలగుంటపాడులో ఓ డిగ్రీ కళాశాల, నెల్లూరు జిల్లా ఉలవపాడులో ఓ స్కూలు నుంచి పెద్ద ఎత్తున నమోదయ్యాయి. ఈ విషయంపై ఉన్నతాధికారులు, ఎన్నికల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికారులు మండల స్థాయిలో అప్రమత్తమయ్యారు. శింగరాయకొండ తహశీల్దారు సిహెచ్.ఉషను అమత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కలిసి బోగస్ ఓట్లతో తమకు సంబంధం లేదని లేఖ రాశారు. పొన్నలూరులో కూడా అలా ఓట్లు నమోదయి ఉండటంతో తహశీల్దారు సైలెంద్రకుమార్ మాట్లాడుతూ దొంగ ఓట్లకు సంబంధించి ఎవరైనా వస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండలంలో అలా అనుమానం వచ్చిన ప్రతి ఓటుకీ స్లిప్పులు కూడా ఇవ్వలేదని వివరించారు.



చలివేంద్రంను ప్రారంభిస్తున్న దృశ్యం

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-మార్కాపురం

ఉగాది పండుగను పురస్కరించుకొని స్థానిక శ్రీ అల్లూరి పోలేరమ్మ స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు 'స్మైల్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత మినరల్ కూలింగ్ వాటర్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. చలివేంద్రాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ రాబోవు రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సంస్థ నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో "స్మైల్ ఫౌండేషన్" చైర్మన్ తిరుమలరెడ్డి సుబ్బలక్ష్మి, సెక్రటరీ ఏరువ స్వర్ణలత, జాయింట్ సెక్రెటరీ ఏరువ సునీత, ట్రెజరర్ సానికొమ్ము లక్ష్మీదేవి, సభ్యులు ఏరువ శ్రీనివాస్‌రెడ్డి, తిరుమలరెడ్డి కిషోర్‌రెడ్డి, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.



వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న శిద్దా

వధూవరులకు 'శిద్దా' ఆశీర్వాదం

ప్రజాశక్తి-చీమకుర్తి

జనవిజ్ఞానవేదిక డివిజన్ నాయకులు చలువాది రమేష్, సువర్ణలత దంపతుల కుమారుడు రవితేజ, రూపల వివాహ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పాల్గొని ఆశీర్వదించారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన వధూవరులను పలువురు ఆశీర్వదించారు. జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ బి.జవహర్ దంపతులు, సుదర్శన గ్రానైట్ అధినేత నూనె సుబ్రహ్మణ్యం, నూనె అనుదీప్, నూనె వంశీకృష్ణ, నూనె హేమసుందరరావు, ఒంగోలు గెలాక్సీ అధినేత చలువాది బదరీనారాయణ, మద్దిపాడు ఏఎంసి మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి, అలపాటి నరసింహారావు, కె వడ్డికాసులు, లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ పి విజయకుమార్‌రెడ్డి, చలువాది నిఖిల్, చలువాది త్రివేణి, నూనె శివనాగేశ్వరరావు, దారా కూర్మయ్య, రాజేశ్వరి దంపతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయండిలా..

సాధారణ ఎన్నికలతో పోల్చుకుంటే భిన్నంగా మండలి ఎన్నికల ఓటింగ్ ● అవగాహన లేకుండా ఓటు వేస్తే చెల్లుబాటు కాదు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు నేడు మార్చి 13వ తేదీన జరగనుంది. పట్టభద్రుల స్థానం నుంచి 22 మంది ఉపాధ్యాయ స్థానం నుంచి 8 మంది బరిలో ఉన్నారు. శాసనమండలి ఎన్నికల్లో ఓటింగ్ సాధారణ ఎన్నికలకు భిన్నంగా ఉంటుంది. ఇక్కడ పోటీలో ఉన్న వారందరికీ ప్రాధాన్యత ఓటును వేయవచ్చు. శాసనసభ ఎన్నికల మాదిరిగా పార్టీల గుర్తులు, ఎలక్ట్రానిక్ మెషీన్లు ఉండవు. ఇక్క బ్యాలెట్ పేపర్ మాత్రమే ఉంటుంది. అందు లో అభ్యర్థి పేరు, ఫొటో ఉంటాయి. వాటికి ఎదురుగా ఉన్న గడుల్లో ఓటు వేసుకోవచ్చు. ఒక్కరికే ఓటు వేయవచ్చు. లేదంటే ప్రాధాన్యతా క్రమంలో అందరికీ ఓటు వేయవచ్చు.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

ఎన్నికల కమిషన్ గుర్తించిన ఏదైనా ఒక గుర్తింపు కార్డు తీసుకొని ఓటు వేయడానికి వెళ్లాలి. ఈ ఎన్నికల్లో సిరా ఉండదు. ప్రాధాన్యత క్రమంలో ఓటు వేయడం కోసం బ్యాలెట్ పేపర్‌తో పాటు ఎన్నికల కమిషన్ పోలింగ్ బూత్‌లో ఇచ్చే పెన్ను లేదా మార్కర్‌ను ఉపయోగించే ఓటు వేయాలి. ప్రాధాన్యత సంఖ్యను అభ్యర్థి ఎదురుగా ఉన్న గడిలో వేయాలి. మన దగ్గర ఉన్న పెన్ను గాని, పెన్సిల్ గాని ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదు. అభ్యర్థి పేరుకు ఎదురుగా



ఉన్న గడిలో మాత్రమే నంబర్ వేయాలి. ప్రాధాన్యత క్రమంలో అందరి కంటే ఎక్కువగా ఇష్టపాత్రుడైన వారి పేరు ఎదురుగా ఉన్న గడిలో 1 అనే అంకెను వేయాలి. తరువాత ఇష్టమైన వారు బరిలో ఉంటే ప్రాధాన్యతను బట్టి 2,3,4 నంబర్లను వేసుకుంటూ పోవాలి. ఒకటో ప్రాధాన్యత ఇవ్వకుండా 2,3,4, ఇస్తే ఓటు చెల్లదు. ఒక్కరికే ఓటు వేయాలంటే వేసుకోవచ్చు. అవసరం అనుకుంటే ఎందరికైనా ఓటు వేయవచ్చు. ఒకే అంకెను ఇద్దరికీ ఇస్తే ఓటు చెల్లుబాటు కాదు. 1,2,3,4.. అంకెలు ప్రాధాన్యతకు ఇస్తే చెల్లుబాటు అవుతాయి. ఒకటి, రెండు, మూడు, నాలుగు అని అక్షారాలు రాసినా, ఓటుపై సంతకాలు చేసినా, నిరసనలు, అభ్యంతకరమైన మాటలు రాస్తే ఓటు చెల్లకుండా పోతుంది.

మనకు నచ్చిన అభ్యర్థి గడికి ఎదురుగా రైట్ టిక్ మార్కు, ఇంటూ వంటి గుర్తులు పెట్టిన ఓటు చెల్లదు. గడి మధ్యలోనే నంబర్ వేయాలి. ఇద్దరు అభ్యర్థుల మధ్య నంబర్ వేస్తే ఓటు చెల్లుబాటు కాదు.

ప్రాధాన్యత ఓటు వేస్తేనే మంచిది

శాసనమండలి ఎన్నికల్లో ప్రాధాన్యత ఓటుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. అయితే ప్రస్తుతం బరిలో అభ్యర్థులు కేవలం ఒకే ఓటును ఓటర్లను కోరుతున్నారు. దీంతో పోలైన ఓట్లలో సగం కంటే ఒకటి ఎక్కువ రాకపోతే ఓట్ల లెక్కింపులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. పైగా ప్రాధాన్యత ఓటు వేస్తే మొదటి ప్రాధాన్యత ఇచ్చిన వారికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. మొదటి ఓటు వేసిన అభ్యర్థి పోటీ నుంచి ఎలిమినేట్ అయితే మాత్రమే 2,3,4 ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. కాబట్టి మొదటి ప్రాధాన్యత ఓటు వేసిన వారికీ ఏమీ ఇబ్బంది ఉండదు. బ్యాలెట్ పేపర్లో ఏ ఒక్కరికీ సంఖ్య వేయకపోయినా ఆ ఓటు చెల్లదు. పై సూచనలు తప్పకుండా పాటించి విలువైన ఓటు హక్కును అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని శాసనమండలిలో సమస్యలపై పోరాటం చేసే వారిని ఎన్నుకోవాల్సిన అవసరం ఉంది.

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-నగరం

మండల కేంద్రం నగరం సెంటర్‌లో వైసిపి ఆవిర్భావ దినం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు హాజరయ్యారు. ముందుగా రాజశేఖర్‌రెడ్డి మరియు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో నగరం మండల పరిషత్ కార్యాలయంలో ఈరోజు గ్రామ పంచాయతీ సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు సచివాలయ కన్వీనర్లు గ్రామ వాలంటీర్లు మరియు గృహ సారథులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావు మాట్లాడుతూ అర్హత ప్రామాణికంగా ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, జడ్పిటిసి నాగమణి, పెద్దపల్లి, గొల్లపాలెం పిఎసిఎస్ అధ్యక్షుడు బెల్లంకొండ వెంకట్రామయ్య, పూడివాడ సర్పంచ్ పాగోలు వెంకటేశ్వరావు, అన్ని గ్రామ పంచాయతీ సర్పంచులు ఎంపీటీసీలు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

చెరుకుపల్లి: వైసిపి 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చెరుకుపల్లి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ రావు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు మత్తి దివాకర రత్న ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు పైనమ్ ఏడుకొండలురెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పైనమ్ రంగారెడ్డి, జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షుడు చీరాల ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు, మరివాడ వెంకట ప్రసాద్, కామినేని కోటేశ్వరరావు



నగరంలో కేక్ కట్ చేస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి

తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె: వైసిపి 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. పార్టీ జెండాలను ఆవిష్కరించి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రేపల్లె పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు పార్టీ జెండాను ఆవిష్కరించారు.వైసీపీ సమర్థవంతంగా పని చేస్తే కార్యకర్తలకు, నాయకులకు గుర్తింపు ఉంటుందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ కట్టామంగా వైసీపీ పట్టణ అధ్యక్షులు గడ్డం రాధాకృష్ణమూర్తి వైసీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్య బాబు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిజాంపట్నం: వైసిపి 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నిజాంపట్నంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిజాంపట్నంలో వైఎస్సార్ విగ్రహానికి వైసిపి నాయకులు మోపిదేవి హరినాథ్ బాబు, జడ్పిటిసి సభ్యుడు నర్రా సుబ్బయ్య, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఢిల్లీ పీఠాన్ని ఢీకొట్టి తెలుగువాడి ఆత్మ గౌరవాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చాటి చెప్పారన్నారు. ఎన్నో కష్టాలు పడి పార్టీని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి తెచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఉన్నవ వెంకటేశ్వరరావు (చంటి), మండల సచివాలయల కన్వీనర్ నాజర్ ఖాన్, ఉప సర్పంచ్ మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు: పర్చూరు వైసిపి కార్యాలయంలో వైసిపి 13వ ఆవిర్భావ దినోత్సవం ఆమంచి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్చూరు పార్టీ కార్యాలయంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పర్చూరు నియోజకవర్గ అబ్జర్వర్ ఇన్‌ఛార్జి చుండూరి రవిబాబు, సుభాష్, మార్టూరు మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి, పర్చూరు మండల కన్వీనర్ కఠారి అప్పారావు, పర్చూరు ఎంపిపి మేకా ఆనందకుమారి, మహిళా నాయకురాలు గోరంట్ల శివ కుమారి, ముప్పాళ్ల రాఘవయ్య, ఉప సర్పంచ్ గాదె సురేష్, గర్నెపూడి రవి చందు (సన్నీ), దేవరపల్లి గ్రామ ఉపసర్పంచ్ తోకల కృష్ణమోహన్, ఉప్పలపాటి అనిల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

చీరాల: వైసిపి 13వ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం రామకృష్ణాపురంలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఆవిర్భావం దినోత్సవ వేడుకల్లో భాగంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం కేక్ కటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో చీరాల మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ శిఖాకొల్లి రామసుబ్బులు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వార్డు ఇన్‌ఛార్జులు, చీరాల మండలం వైసిపి నాయకులు, వేటపాలెం మండలం వైసిపి నాయకులు, చీరాల నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఏలూరి పరామర్శ

ప్రజాశక్తి-యద్దనపూడి

మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు కొల్లా వీరవసంతరావు దశదిన కర్మ సంధర్భంగా ఆయన కుమారుడు రమణ మరియు కుటుంబ సభ్యులను పర్చూరు శాసన సభ్యుడు ఏలూరి సాంబశివరావు ఆదివారం పరామర్శించారు. అదేవిదంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మండవ చంద్రం, మండవ బాలమహేశ్వరి, హరిదాసు, కృష్ణయ్యలను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాలే శారమ్మ, దాసరి సంపూరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంఎల్ఏతో పాటు నాయకులు గుదే తారక, కె సాంబయ్య, నిమ్మల సాంబశివరావు, కె వంశీ, పి వెంకటేశర్లు, నరేంద్ర తదితరులు ఉన్నారు.



బాధితులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

కరాటే పోటీలలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-చీరాల

జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఇంటర్ స్టేట్ ఇన్విటేషనల్ ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో జరిగిన అంతర్రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో పట్టణంలోని సందీప్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం జరిగిన ఈ పోటీలలో బాపట్ల జిల్లా తరపున చీరాలలోని సందీప్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. కటా విభాగంలో జూనియర్ రెడ్ బెల్ట్ స్థాయిలో జరిగిన పోటీలలో ఏ భవ్య శ్రీదేవి గోల్డ్ మెడల్‌ను సాధించింది. ఎల్లో బెల్ట్ సీనియర్స్ విభాగంలో జరిగిన పోటీలలో కాటా విభాగంలో సిహెచ్ పూజిత ద్వితీయ బహుమతిని, ఆర్ సాహితి తృతీయ బహుమతిని సంపాదించగా ఎల్లో బెల్ట్ జూనియర్ విభాగంలో జరిగిన పోటీలలో ఏ వసంత కటా విభాగంలో ద్వితీయ బహుమతిని పొందింది. వీరందరూ చీరాలలోని సందీప్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కి చెందిన విద్యార్థులు కావడం విశేషం. సందీప్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వ్యవస్థాపకులు డాక్టర్ తుల్లూరి వెంకటేశ్వర్లు పోటీలలో గెలిచిన విజేతలను, కరాటే మాస్టర్ నక్కల శివప్రసాదును ప్రశంసించారు.



ఓ వివాహ జంటను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

వరుడికి ఎమ్మెల్యే రవికుమార్ ఆశీర్వాదం

ప్రజాశక్తి-అద్దంకి


అద్దంకి పట్టణ చెందిన గార్లపాటి ప్రసాదరావు లక్ష్మీ ప్రసన్న దంపతుల కుమారుని వివాహం సింగరకొండలోని శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరుగగా ఆదివారం శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ వివాహ వేడుకలో పాల్గొని వధూవరులు పవన్ కుమార్, గాయత్రిలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మండలంలోని నాగులపాడు గ్రామంలో కరి నారాయణమ్మ దశదిన కార్యక్రమానికి హాజరై వారి చిత్రపటానికి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించిన ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఘటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం జె పంగులూరు మండలం తూర్పు కొప్పెరపాడు గ్రామంలో ఎనికపాటి సురేష్ నూతన గృహ ప్రవేశ వేడుకలో పాల్గొన్నారు. అదేవిధంగా తూర్పు కొప్పెరపాడులో నీలం హనుమంతరావు రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలి శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పరామర్శించి ఆరోగ్య విషయమై వాకబు చేశారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు పూర్తి: తహశీల్దారు

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

నేడు జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీల్దారు సీతారత్నం తెలిపారు. 1,134 మంది ఓటు హక్కు కలిగిన గ్రాడ్యుయేట్స్ 90 నెంబర్ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకోవాలని, 32 మంది టీచర్స్ 42వ నెంబర్ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. ఓటు హక్కు వినియోగించుకునేవారు ప్రభుత్వం జారీ చేసిన ఓటరు స్లిప్పుతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఏదో ఒక గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



సన్మానం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం తీర్మానించింది. ఆదివారం యర్రగొండ పాలెంలోని ఎన్జీఓ హోంలో ఆంధ్రప్రదేశ్ ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ అధ్వర్యంలో జిల్లా ఉద్యోగుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రకాశం జిల్లా ఉద్యోగుల ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షులుగా బుడిగపోగు రమేష్, అధ్యక్షులుగా వినోద్, మహిళ అధ్యక్షులుగా అరుణా, సెక్రెటరీగా శివ కృష్ణ, ట్రెజరీగా రమేష్ బాబుతో పాటు మరో పది మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా హాస్పటల్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న సిబ్బంది పాల్గొన్నారు.

జనఔషధి కేంద్రం ప్రారంభం


జన ఔషధిని ప్రారంభిస్తున్న మంత్రి సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాల ఆవరణలో ప్రధానమంత్రి జనఔషధి కేంద్రాన్ని ఆదివారం రాష్ట్ర పురపాలక, శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ జన ఔషదీ కేంద్రం ద్వారా 50 శాతం నుండి 90 శాతం వరకు తగ్గించి ప్రజలకు మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ జన ఔషదీ కేంద్రాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ ఎం శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది, జన ఔషధీ కేంద్రం నిర్వాహకులు, నాయకులు పాల్గొన్నారు.

శాసనమండలి ఎన్నికలకు సర్వం సిద్ధం

ఓటు హక్కు వినియోగించుకోనున్న 28,179 మంది ఓటర్లు


ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

శాసనమండలి ఎన్నికల ప్రచార పర్వం ముగిసింది. సోమవారం జరుగనున్న ఎన్నికల ప్రక్రియ కోసం బ్యాలెట్ బాక్స్‌లు, ఎన్నికల సిబ్బంది ఆదివారం తరలివెళ్ళారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం బాపట్ల జిల్లాలో 40 పోలింగ్ బూతులు ఏర్పాటు చేశారు. గ్రాడ్యుయేట్ ఓటర్ల కోసం 27 పోలింగ్ బూతులు, ఉపాధ్యాయ ఓటర్ల కోసం మరో 13 పోలింగ్ బూతులు ఏర్పాటుచేశారు. మొత్తంగా 28,179 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగనుంది. బాపట్ల జిల్లాలోని 13 మండలాల్లో జరుగనున్న ఎన్నికల పోలీసు బందోబస్తు కోసం ప్రతి పోలింగ్ కేంద్రానికి తగినంత మంది పోలీస్ సిబ్బంది మరియు అధికారులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి స్ట్రైకింగ్ ఫోర్స్‌కి సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ ను అధికారిగా నియమించడం జరిగింది. స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌కి అడిషనల్ ఎస్పీ, డి.ఎస్.పి స్థాయి అధికారుల సారథ్యం వహించనున్నారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో సున్నంతో గీతలు వేయించామని, ఎవరైతే ఓట్లు వేయడానికి వస్తారో వారు ఓటు హక్కు వినియోగించుకున్న తరువాత అక్కడ ఉండ కూడదని అధికారులు తెలిపారు. ఎమ్మెల్సీ ఎలక్షన్‌లు జరిగే ప్రాంతాలలో 144 సి.ఆర్.పీ.సి సెక్షన్ అమలులో ఉన్నందున ఎవరు గుంపులు గుంపులుగా చేరకూడదన్నారు. ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేకుండా పోలింగ్ కేంద్రంలోనికి వెళ్ళరాదని పేర్కొన్నారు.

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి పటిష్ట పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు. ఒక అడిషినల్ ఎస్పీ, ఇద్దరు డిఎస్పీ లు, 8 మంది ఇన్స్పెక్టర్ లు, 40 మంది ఎస్.ఐలు, 20 ఏ.ఎస్.ఐ లు, 95 హెడ్ కానిస్టేబుళ్లు, 367 మంది కానిస్టేబుళ్లు, 68 మంది హోమ్ గార్డులు, 98 మంది ఆర్మడ్ ఫోర్స్ మొత్తం 697 మంది పోలీస్ సిబ్బంది మరియు అధికారులతో పాటు 3 సెక్షన్‌ల ఏ.పీ.ఎస్.పీ బలగాలను వినియోగిస్తున్నారు. ప్రతి మండలంలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లను నియమించారు. 13 స్ట్రైకింగ్ ఫోర్స్ లను, 7 క్విక్ రియాక్షన్ టీమ్ లను, 3 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ లను ఏర్పాటు చేశారు.

బాపట్ల జిల్లా పరిధిలో ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
చీరాల	10,088	753
పర్చూరు	7,642	432
అద్దంకి	8,720	604

ఎంఎల్‌సి ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

ఎస్‌పి మల్లికగర్గ్



ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

జిల్లాలో శాసనసమండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికలు సజావుగా జరిగేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసినట్లు జిల్లా ఎస్‌పి మల్లికగర్గ్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎకెవికె కళాశాలలో ఎన్నికల విధి నిర్వహణపై అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది ఎన్నికల నియమావళిని అమలుపరచాలని, పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల వరకు ఎవరూ గుమికూడి ఉండకుండా చూడాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల లోపలికి నిషేధిత వస్తువులు తీసుకువెళ్ళకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్లను క్యూలైన్లో వెళ్లేలా చూడాలన్నారు. ఓటర్లు ఓటర్ స్లిప్‌తో పాటు ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపుకార్డును వెంట తీసుకొని రావాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను ప్రభావితం చేయడం బెదిరింపులకు పాల్పడకుండా చూసుకోవాలన్నారు. ఎన్నికల సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ అనంతరం వాటిని ఆయా పోలింగ్ కేంద్రాల వరకు మొబైల్‌పార్టీలు సురక్షితంగా చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లాలో 1500 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. మొత్తం 38 మండలాలలో 51 లోకేషన్లలో 138 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల నిర్వహణ జరుగుతుందన్నారు. అందులో 15 సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు. ముగ్గురు ఎయస్‌పిలను ఇన్‌ఛార్జిలుగా నియమించడం జరిగిందని, 8 మంది డిఎస్‌పిలు, 15 మంది ఇన్‌స్పెక్టర్లు, 68 మంది ఎస్ఐలు కలిపి మొత్తం 1500 మంది సిబ్బంది ఉన్నట్లు పేర్కొన్నారు. ఎనిమిది స్పెషల్ స్ట్రైకింగ్‌ఫోర్స్, 15 క్యూఆర్‌టి, 38 స్ట్రైకింగ్‌ఫోర్స్, సెక్టార్ మోబైల్స్ 22, ఫ్లైయింగ్ స్వాడ్ 38, 11 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎయస్‌పి కె.నాగేశ్వరరావు (అడ్మిన్), డిఎస్‌బి డిఎస్‌పి మరియదాసు, డిఎస్‌పిలు, సిఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇంటర్ పరీక్షల నిర్వహణ

- పరీక్ష రాయనున్న 58,945 మంది విద్యార్థులు
- సిసి కెమెరాల పర్యవేక్షణలో..
- కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- ఆర్ఐఒ ఏ.సైమన్ విక్టర్ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఉమ్మడి ప్రకాశంలో ఇంటర్మీడియట్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి(ఆర్ఐఒ) ఏ.సైమన్ విక్టర్ పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 58,945 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సిసి కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు పరీక్షా కేంద్రాలలో కల్పిస్తున్నామన్నారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. జిల్లాలోని అన్ని విభాగాల సమన్వయంతో ఇంటర్మీడియట్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఆర్ఐఒ ప్రజాశక్తికి వివరించారు. అవన్నీ ఆయన మాటల్లోనే..



ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాం. కలెక్టర్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. హైపవర్ కమిటీని ఏర్పాటు చేశారు. కలెక్టర్, ఎస్‌పి, ఆర్‌జెడి, జిల్లా వృత్తి విద్యా శాఖాధికారి, ఓ ప్రిన్సిపల్ ఉంటారు. వీరు పరీక్షలను పర్యవేక్షిస్తారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు 16 పరీక్షలు జరగనున్నాయి. ఇందు కోసం 95 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. 95 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 95 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్‌ను నియమించాం. 4 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 5 సిట్టింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశాం. ఫ్లయింగ్ స్క్వాడ్‌లో ముగ్గురు సభ్యులు విద్యా శాఖ నుంచి ఒకరు, రెవెన్యూ, పోలీస్ శాఖల నుంచి ఒక్కొక్కరు ఉంటారు. సిట్టింగ్ స్క్వాడ్‌లో ఇద్దరు విద్యా శాఖకు చెందిన అధికారులు ఉంటారు. పరీక్షా కేంద్రానికి ఓ కస్టోడియన్‌ను నియమించాం. ప్రశ్నాపత్రాలను పోలీస్ స్టేషన్ నుంచి పరీక్షా కేంద్రానికి తీసుకెళ్ళి పరీక్ష ముగిసిన తరువాత బండిళ్ళను తపాల శాఖకు బట్వాడా చేయటం కస్టోడియన్ బాధ్యత.

పరీక్ష రాయనున్న 58,945 మంది విద్యార్థులు

ఇంటర్మీడియట్ పరీక్షలను మొత్తం 58,945 మంది విద్యార్థులు రాయనున్నారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 27,989 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 30,956 మంది ఉన్నారు. జంబ్లింగ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రతి పరీక్షా కేంద్రంలో సిసి కెమెరా ఏర్పాటు చేసి ఆర్ఐఒ కార్యాలయం, ఇంటర్ బోర్డులో కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తాం. ఎవరైనా అవకతవకలకు పాల్పడితే వారికి చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు, పరీక్షా కేంద్రానికి సమీపంలో జెరాక్స్ షాపులను మూసివేయిస్తున్నాం. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించటం జరగదు. పరీక్షా సమయానికి అరగంట ముందుగా విద్యార్థులు చేరుకోవాలి.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో 4 సమస్యాత్మక పరీక్షా కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాం. దోర్నాల, యర్రగొండపాలెం, కంభం, అర్ధవీడు కేంద్రాలలో సిసి కెమెరాలతో పాటు అదనంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశాం. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ నిరంతరం తనిఖీలు చేస్తున్నాం. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ఆర్టీసి బస్సులు నిర్వహిస్తుంది. వేసవి దృష్ట్యా ప్రతి పరీక్ష కేంద్రంలో ఎఎన్ఎం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశాం.

ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దు

విద్యార్థులు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, సిట్టింగ్, ఫ్లయిండ్ స్క్వాడ్స్ కూడా ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురాకుండా చర్యలు చేపట్టాం, స్మార్ట్ వాచ్‌లు, అండ్రాయిడ్ ఫోన్లు, ఇయర్ బడ్స్, ఎలక్ట్రానిక్ క్యాలిక్యులేటర్స్ తీసుకురావద్దు. విద్యార్థినులను మహిళా పోలీసుల ద్వారా పరిశీలన చేసిన తరువాత పరీక్షా కేంద్రానికి అనుమతిస్తాం. తల్లిదండ్రులు కూడా విద్యార్థులు మొబైల్ ఫోన్స్ తీసుకురాకుండా చూసుకోవాలి.

కంట్రోల్ రూమ్‌కి సమస్యలు చెప్పొచ్చు

ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ, ఇతర సమస్యలపై ఆర్ఐఒ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ నెంబర్ 08592-281275 ఫిర్యాదు చేయవచ్చు. ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు హాల్ టిక్కెట్లు ఇవ్వకపోయినా ఫిర్యాదు చేయాలి. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు వినియోగించుకోవాలి. అందరి సహకారంతో ఇంటర్మీడియట్ పరీక్షలను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహిస్తాం.